# గోడమీద తెల్లసింహం

ధగధగా మెరుస్తోంది సింహం. రెండు భాగాలైపోయిన ప్రపంచానికి మధ్యగా మధ్యవర్తిలా నించుని చూస్తున్నాడు సూర్యుడు. వెండిలాంటి సింహం జూలు కణకణ మెరుస్తోంది.

కులుకుతూ, కేరింతాలుకొడుతూ ప్రజాధనంనుంచి కోరికలసోపానాలు, ఆనందాల ఆకాశంవరకూ నిర్మించుకున్న షాహుకారుగారి గొడ్లసావిడి దివాణం దేవిడీపై కూర్చుని, తెల్ల సింహం సంతోషంగా మెరుస్తోంది.

ఆగస్టు పదిహేను—భారత చరిత్రలో ఉజ్వల కాంతి కిరణంగా ప్రకాశించిన ఆగస్టు పదిహేను—స్వాతంత్ర్యోద్యమానికి 'వరప్రసాదమైన' ఆగస్టు పదిహేను...గడిచిపోయింది. గతించి చరిత్రలో లయమై నెలలైపోయింది.

నాయకులంతా స్వాతంత్ర్య వరప్రసాదం గురించి మహోపన్యాసాలిచ్చారు ... స్వాతంత్ర్య సద్యః ఫలితాలు పూరిగుడిసెలకు రావాలన్నారు..అందాకా శాంతిలేదన్నారు:- ఎన్ని ఉపన్యాసాలు! ఎన్ని సింహగర్జనలు! ఎన్ని కబుర్లు! ఎన్ని డబాయింపులు! ఎంత తీయగా! ఎంత ఘాటుగా!

కాని, స్వాతంత్ర్యం యెవరికి వచ్చింది?—ఐదువందల మంది నైజాములకు, పాదుషాలకు, జమీందారులకు, బిర్లాలకు స్వాతంత్ర్యం వచ్చేసింది!

దేశం — సస్యశ్యామలమైన మాతృదేశం — రెండు ముక్కలుగా నరుకబడింది. రక్తం నదులై, కాలువలై, సముద్రాల కలసి పోతోంది.

అంచాతనే గోడమీద కూర్చున్న తెల్లసింహం జూలు దులిపి నవ్వుకుంటూంది. తెల్లసింహం జూలు మతాబాలాగ మెరుస్తోంది.

అగ్రనాయకులంతా స్వాతంత్రం గురించి దీర్ఘోపన్యాసాలిస్తూనే ఉన్నారు!

పేదలు, అనాథలు, శ్రామికులు, ఆకలితో కనలి, ఆగలేని ఆవేదనతో అలమటించి పోతూనే ఉన్నారు!!

"స్వాతంత్రం వచ్చింది, శాంతంగా ఆకలిని పరిష్కరించుకుందాం" అంటున్నారు. దేశంలోని ధనస్వాములు, పెట్టుబడిదారులు, మహారాజులు, శాంతి అహింసలగురించి, స్వాతంత్రం గురించీ తీయని ఉపనిషత్తులు వల్లిస్తున్నారు.

కార్మికులు కనీస వేతనాలకోసం, గుమాస్తాలు సంసారాల రక్షణకోసం, బడిపంతుళ్ళు బ్రతుకు తెరువుకోసం,—స్వాతంత్ర ఫలితాన్ని రుచి చూడటంకోసం శూన్యహస్తాలతో, దీనదృష్టులతో ఎదురు తెన్నులు చూస్తున్నారు.

గోడమీద తెల్లసింహం జూలు దులిపి సంతోషంతో గర్జిస్తోంది!

ప్రపంచ ప్రజలంతా విస్తుపోయి చూస్తున్నారు. ప్రపంచ కార్మికులంతా గుసగుస లాడుతున్నారు. ప్రపంచ బానిసలంతా "కుట్ర! కుట్ర" అని హెచ్చరిస్తున్నారు. ప్రపంచ మేధావులంతా తర్క వితర్కాలతో పరిష్కారాన్ని వెదకుతున్నారు.

గోడమీద తెల్లసింహం తన అస్తిత్వాన్ని తలచుకొని మురిసిపోతోంది.

షావుకారుగారు పెద్ద భవనాన్ని దూడల సాలగా ఉపయోగిస్తున్నారు. దూడలసాల దేవిడీపై తెల్లసింహం తన పూర్వచరిత్ర తలుచుకుంటూంది.

షావుకారుగారు పూర్వం తన అదృష్టానికి అడ్డంకనే అక్కసుతో తెల్లసింహాన్ని పొడిచి వేయాలనుకున్నారు. కాని గాలి మారింది. నేడు తెల్లసింహాన్ని ప్రేమగా అలంకరించు కొంటున్నారు.

షావుకారుగారి దేవిడీ భుజాలపై కూర్చుని, సంతోషంగా జూలు దులుపు కుంటూంది తెల్లసింహం.

షావుకారుగారు పల్లెటూరులో మూడంతస్థుల మేడా, గొడ్లదివాణం వదిలి పట్టణంలో సుఖంగా లక్షలపై వ్యాపారం

నడుపుతున్నారు. అతని ఆస్తికి రక్షణఇస్తూ పహారాకాస్తోంది, తెల్లసింహం.

పూర్వచరిత్రల అజ్ఞాతసౌరభాన్ని వెదజల్లే ఆ గ్రామంలో బుద్ధుని ప్రశాంత వదనంలాంటి తటాకంలో, అశాంతి, అసంతృప్తి విప్లవాల ప్రతిబింబంగా ఎర్రనితామరలు వికసిస్తున్నాయి.

రాజకీయాలు...రాజకీయాలు ... ఎటుచూచినా రాజకీయవాగ్వాదాలు— మూడు వేలమంది ప్రజలు నివసించగలిగే చిన్నపల్లెటూళ్ళో ఆంధ్రదేశమంతా మూర్తీభవించింది. ప్రతి వీధిలో–ప్రతినీడలో–ప్రతిఅరుగుపైనా గుంపులు గుంపులుగా రాజకీయాలు...

ఆంధ్రదేశ స్వాతంత్రోద్యమంలో ప్రధాన పాత్ర వహించిన దేశసేవకులు, అనేక ప్రజా సమస్యల్లో, ప్రజా సమరాల్లో, అగ్రగాములుగా నిలచిన వీరులు మహాసభ జరుపుకుంటున్నారు....జైళ్ళకూ, లాఠీలకూ, నానా అగచాట్లకూ ఎదురొడ్డి దక్కా–మొక్కీ– లనుభవించిన వీరయోధులు— తెలుగుతల్లి ప్రియపుత్రులు తమ మహాసభజరపుకుంటున్నారు.

ప్రపంచ రాజకీయాలకు ప్రాతినిధ్యం వహిస్తోంది ఈ మహాసభ. 'ప్రపంచ కార్మికులారా ఏకంకండి!' అని ఎలుగెత్తి నూరేళ్ళక్రితం సందేశించిన కారల్ మార్కుస్ మహాశయుని సంతతికి ప్రాతినిధ్యం వహిస్తోంది ఈ మహాసభ...స్త్రీలు...

పురుషులు, యువకులు, వృద్ధులు...కవులు, చిత్రకారులు... గాయకులు...కార్మికులు, రైతులు...మతంలేని హిందువులు, ముస్లిములు...ఒకేఒక ఆశయంకోసం, ఒకే పరమావధికోసం, జీవితాలర్పించే ఉద్రేకంతో సమావేశమవుతున్నారు.

కులుకుతూ, గోడమీద కూర్చున్న తెల్లసింహం భయభ్రాంతులతో ముఖం చిట్లించింది. ప్రజా వెల్లువను, విప్లవ నాయకత్వాన్ని చూచి నివ్వెరపోతోంది తెల్లసింహం...

తటాకంలోని తామరలు కోపభీకరమైన తామ్రమాత్రుల్ని తెరిచాయి. వివేకంలా మెరిశాయి—విప్లవంలా గర్జించాయి.

"ప్రజాద్రోహులు ఏ రంగుపూనుకున్నా సహించం. డొక్కచీల్చి అసలురంగు బైటపెట్టితీరతాం—ఆంధ్రరాష్ట్ర నిర్మాణానికి అడ్డంకులేవైనాసరే – తొలగించితీరతాం! పునాది రాళ్ళు వేసితీరతాం!"

ఉద్రేకంలో ఊగిపోతున్నాయి తామరలు.

ముప్పయిఐదు సంవత్సరాలకిత్రం గర్జించిన ఆంధ్ర జాతీయవాదుల కంఠాలు అలసి, సొమ్మసిలి, పాపం రుద్ధమయాయి. కొన్ని కంఠాలు శత్రుకంఠంతో శృతికలుపుతున్నాయి...ఆంధ్ర పౌరుషాన్ని ఉత్సహించిన మహాకవులు-రాక్షసుల కొలువుకూటంలో వందిమాగధులై మదిరం సేవిస్తున్నారు. నేడు ప్రజాద్రోహులై, దేశమంతా నైజాంప్రభువు

చల్లని పరిపాలనలో ఉండితీరాలని మత్తులో ఒళ్ళు తెలియక ప్రలాపిస్తున్నారు.

"మధ్యయుగాలనాటి పీడకలలకు చిహ్నాలైన జమీందారీ, భూస్వామిక విధానాల అనాగరిక, అసహ్యాచ్ఛాయలను సమూలంగా పెరికివేస్తాం... నూతన ప్రజాతంత్ర వ్యవస్థ నిర్మించేతీరతాం!"

ప్రజాశక్తి గర్జించింది.

చలికాలపు మంచులో తడిసిన పిల్లిలా ముడుచుకుపోయింది సింహం!

"తెలుగుబిడ్డలను నిత్యం బలిగొంటూన్న నైజాం నరకాసురుణ్ని హతమార్చి తీరతాం!"

కసిగా ప్రతీకార మూర్తి భావంగా, ప్రజాశక్తి గర్జించింది.

పాపం...గోడమీద కూర్చుని చూస్తున్న తెల్లసింహం వెల వెలాబోయింది...ఎప్పుడూ అస్తమించడన్న ప్రతీతిగన్న సూర్యుడు మారని ఎడ్వర్డురూపాయిలాగ మారిపోతున్నాడు ...పడమటి సముద్రంలో మునిగి గిజగిజా తన్నుకుంటున్నాడు సూర్యుడు...సూర్యుడు అస్తమించగానే, ప్రాణంలేని మట్టిబొమ్మలా త్వరత్వరగా మారిపోతోంది, తెల్లసింహం.

[ 1948 ప్రారంభంలో కృష్ణాజిల్లా బుద్ధవరంలో జరిగిన ఆంధ్రరాష్ట్ర కమ్యూనిస్టుపార్టీ మహాసభలో ప్రతినిధిగా పాల్గొన్నప్పుడు వ్రాసినది. ]

ప్రచురణ : శ్రీ సెట్టి ఈశ్వరరావుగారి
విశాలాంధ్ర మాసపత్రిక—మద్రాసులో మే—1948